

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

# రైలూ... గోపాలంగారి ఇల్లూ

**అగ్రహారానికే కాదు,** ఆ మాటకొస్తే అమలాపురానికే రైలు లేదు. చుట్టుపక్కల అందరూ కూడా రాజమండ్రీవో, కాకినాడో వెళ్ళి ఎక్కాల్సిందే. అయితే రాజమండ్రీ నించి చుట్టుపక్కల ఊర్లకి రైలు మార్గాన్ని విస్తరిస్తారని చాలా రోజులుగా చెపుతున్నారు.

' అగ్రహారం లోకి ఇప్పుడో, అప్పుడో రైలు వచ్చేస్తుంది!' అని పుకార్లు మొదలయ్యి కూడా చాలా రోజులు అయ్యింది.

'అది ఎటువైపు వస్తుందో తెలియదు.. రోడ్డువైపైనా రావచ్చు, పెరటివైపైనా రావచ్చు పట్టాలు' అని అందరూ చెప్పుకోవడం మొదలు పెట్టారు. ఎటువైపు వచ్చినా సరే అగ్రహారం వారి ఇళ్ళల్లోంచో, పెరళ్ళల్లోంచో కొంత స్థలం పోవడం ఖాయం.

'ఎటు పోయినా సరే , గవర్నమెంటు వారు ఎంతో కొంత డబ్బు ఇస్తారుట లే!, 'అని ఒకరూ..

'డబ్బు సంగతి సరే.. అసలు పెరడు పోతుందో, ఇంటి ముందువైపే పోతుందో? అసలెంత స్థలం పోతుందో? ఊరిలోంచి రైలు వెళితే ఎలా ఉంటుందో? ' ఇలా అందరూ రకరకాలుగా, తమకు తెలిసినంతలో తోచినట్టుగా మాట్లాడుకుంటున్నారు.

రాముల వారి కల్యాణం అయిన తర్వాత పందిట్లో మళ్ళీ వచ్చింది చర్చ..

'అసలూ. ఇంతకీ రైలు ఎప్పుడు వస్తుందిట? 'అని ఒకరు

'అబ్బే ఎప్పుడో ఎందుకు? మరోక ఆరునెలలు.. అప్పుడే రాజమండ్రీ నించి పట్టాలకోసం తవ్వుతున్నారుట.. మా చిన్నవాడికి తెలిసిన వారెవరో చెప్పారుట' అని స్కూల్ మాస్టారు అన్నారు.

'ఆ అంటారు కానీ అప్పుడే వచ్చిందా? పెట్టిందా? వచ్చినప్పుడు చూద్దాం 'అని చివరింటి గోవిందం.. అన్నాడు.

‘అలా అంటావేం గోవిందం? గవర్నమెంటు వారు తలుచుకుంటే ఎంత సేపు? అసలు ఎటు వైపు వస్తుందో? అది తెలుసుకోవాలి ముందు.. అప్పుడే కదా తెలిసేది.. ‘ అని శర్మగారు అన్నారు.

"అప్పుడు మనం ఇళ్ళల్లోంచి బయటకెలాగండీ వెళ్ళడం? ఇంటి ముందు పట్టాలా? భలే ఉంది సంబడం "అంది ఆయన భార్య అనసూయమ్మ గారు.

"ఇంటి ముందు అంటే ఇంటి ముందు నువ్వు ముగ్గు వేసే చోట వస్తుందా ఏమిటి అనసూయా? ఇళ్ళే వెనక్కి జరగాలి.. జరుగుతాయి అన్నారు ఆయన

అప్పటివరకూ రైలు సంగతి పెద్దగా తెలియని ఆడవారు.. ఈ మాటతో ఉలిక్కి పడ్డారు. "ఎలాగూ? ఇళ్ళూ, వాకిళ్ళూ వెనక్కెలాగండీ జరపడం?" అందావిడ.

" పిచ్చిదానా? ఇల్లు జరపడమంటే ప్రహరీ గోడలుంటే వాటిని తీసేసి ఇంకొంచం లోపలకి కట్టుకోవడం, గోడ లేకపోతే ఇంటి ముందున్న అరుగులు తీసేయ్యడం ఇలాంటివన్నమాట "అన్నారాయన నవ్వుతూ.. ఆశ్చర్యంతోనూ, భయంతోనూ ఆ డవారి కళ్ళు పెద్దవయ్యాయి.

"అంటే మన అందరి ఇళ్ళూ అంతేనా?" దాదాపు అందరూ ఒక్కసారే అడిగారు..

"అసలంటూ రైలు రావాలే కానీ అన్ని ఇళ్ళూనూ "అన్నారు శర్మగారు వారిని భయపెట్టడానికి..

"అందరివి పోయినా సరే పరవాలేదు.. గోపాలం గారిదీనా? "అంది ఒకావిడ.

"ఆహా" అని గట్టిగా అనలేక మౌనంగా తల ఊపారు శర్మగారు. ఒక్క క్షణం నిశ్శబ్దం పందిట్లో.

"నిజమే? వాళ్ళ ఇల్లు కూడా కొట్టేస్తారా?" అని ఆ డవారు లోచనలో పడ్డారు.

ఇంతలో శర్మ గారు "ఇంకా వీటన్నింటికీ చాలా సమయం ఉందిలే.. ఇప్పటికి నాలుగేళ్ళనించీ అంటున్నారు రైలు రైలు అని.. తరవాత సంగతులు చూడండి" అన్నారు.

భోజనాలకని కూర్చున్నారు అందరూ

"మాయదారి రైలు.. రాకపోతేనే నయం.. గోపాలం అన్నయ్యగారి ఇల్లు మాత్రం అలాగే ఉండాలి" అంది అనసూయ..

ఆవిడ మనసులో ఇందాకటి సంభాషణే మెదులుతోంది. ’

’అవును..నిజమే.. అది వాళ్ళొక్కళ్ళ ఇల్లేనా.. ఊరందరికీ ఇల్లే "అంది సావిత్రి. అలా సంభాషణ వారింటిచుట్టూ తిరిగింది.

గోపాలంగారి ఇల్లూ, ఇంటిముందు వాకిలీ, వెనకాల ఉన్న పెరడూ కలిసి కనీసం రెండెకరాలైనా ఉంటుంది. చాలా పెద్ద ప్రహరీ గోడా, దానికో ఎత్తయిన రేకుల గేటు, గేటు తీసుకుని లోపలకి వస్తే విశాలమైన గ్రౌండు.

గ్రౌండుకి కుడివైపున కొద్దిగా లోపలకి ఎత్తుగా చెక్కతో కట్టిన ధాన్యపు గాదుల గదులు. నేలకి సిమెంటు తాపడం చేసి దానిమీద స్థంభాలు లేపి, పైన చెక్కతో కట్టిన గదులు అవి. నేలకి ఆనుకుని ఉంటే నీరు తగిలి ధాన్యం ఛెడిపోయే ప్రమాదం ఉంది కనక, అంతే కాక నేలనానుకుని ఉంటే ఎలకలూ, పాములూ అవీ చొరబడే ప్రమాదమూ ఉంది కనక అలా ఎత్తుగా కడతారు.

ధాన్యపు గదుల పక్కగా రెండు పెద్ద పెద్ద పురి అరుగులు.. రోజూ వారి వాడకానికి కావలసిన ధాన్యాన్ని అందులో పోస్తారు.. దానిపక్కన అంటే ఇంటి కుడివైపుకు ఉన్న వసారాలో ఉన్న మూడు గదుల్లో అగ్రహారం బడి. ఊరిలో అందరికీ అది ‘ గోపాలంగారి బడి‘ గానే తెలుసు. దానిపక్కనే పిల్లలు ఆడుకునే స్థలం.

ఇంక ఇంటి విషయానికొస్తే, గ్రౌండుకని వదిలిన స్థలం తర్వాత వారి ఇంటి తలవాకిలి మొదలవుతుంది. అక్కడ ఎప్పుడూ పచ్చగా అలికి ముత్యాల ముగ్గు వేసి ఉంటుంది. అది పనిమనిషి కాక, గోపాలంగారి భార్యో, లేక వారి ముగ్గురమ్మాయిల్లో ఒకరో లేదా వారి కోడలో వేస్తారు. ఇంటి ముగ్గు, ఇల్లాలో పిల్లలో వెయ్యాలనేది గోపాలంగారి భార్య వరలక్ష్మమ్మగారి సిద్ధాంతం.

వారి ఇంట్లో ఉన్నంత పెద్ద వసారా చుట్టుపక్కల ఉన్న ఇళ్ళల్లో ఎవరికీ లేదు. వసారాలో పెద్ద ఉయ్యాలా బల్ల.. దాని పక్కగా గోపాలంగారితో మాట్లాడడానికి వచ్చేవారి కోసం వేసి ఉంచిన పేము కుర్చీలూ, పెద్ద చెక్క బల్లా.. ఇది దాటుకుని లోపలకి వస్తే పదో, పన్నెండో గదులూ, మండువాలూ, మూడు వంట గదులూ.. నడవలూ.. ఇలా చాలా చాలా పెద్ద ఇల్లు.. వెనక పెద్ద వాకిలీ, దానివెనక పశువుల పాక... పేరుకి పాక కానీ, దాని మీదా బంగాళా పెంకులు పరిచి పక్కాగా చేసారు.

మామిడి, పనస, జామ, దానిమ్మ, నారింజ, సపోటా లాంటి ఫలవృక్షాలూ, మందారం, నందివర్ధనం, రామబాణం లాంటి పూల చెట్లూ మొక్కలూ.. ఆ ఇంటికే వింత శోభనిస్తాయి.

ఇలాంటి ఇళ్ళు చాలా ఉండవచ్చు.. ఐతే గోపాలంగారి ఇల్లూ, లోగిలీ గొప్పతనమేమిటి? అంటే అది అగ్రహారం వాళ్ళనే అడగాలి.

చిన్నిగాడికి పన్నెండేళ్ళుంటాయేమో.. సన్నగా పొట్టిగా ఉంటాడు. ఈ మధ్యనే గోపాలంగారి బడి దాటి హైస్కూల్ కి సైకిల్ మీద వెడుతున్నాడు. వాడికి సైకిల్ తొక్కాలని అనిపించిన మొదటిరోజు.. వాళ్ళ నాన్నని అడిగాడు

" నాన్నా! నాకు సైకిల్ నేర్పిస్తావా? " అని..

"వేలెడంత లేవు.. ఇప్పటినించీ ఎందుకు? అయినాకు ఇప్పుడు టైము లేదు వచ్చే ఏడాది చూద్దాంలే ! " అన్నాడు ఆయన..

ఏడుపు ముఖం పెట్టుకుని అమ్మమీదా, అన్నం కంచం మీదా చూపించాడు అలక. అప్పుడు వాళ్ళ అమ్మ చెప్పింది.

" వెధవన్నా! అన్నం మీద అలుగుతావేరా? నేలకి కాలు అందదు కదా, రోడ్డుమీదైతే కింద పడి దెబ్బ కొట్టుకుంటావేమో అని మీ నాన్న భయం. పోనీ ఒక పని చెయ్యి. గ్రౌండులో తొక్కడం నేర్చుకో పిన్నిగారి సుబ్బడికి చెప్తాలే నీకు నాలుగు రోజులు నేర్పమని" అంది.. అప్పుడు తిన్నాడు అన్నం చొక్కాచివరతో కళ్ళు తుడుచుకుని.

చిన్న చిన్న పిల్లలందరూ ఆటలే కాదు.. గోపాలంగారి గ్రౌండులోనే సైకిళ్ళు తొక్కడం నేర్చుకుంటారు. పొట్టినిక్కర్లు వేసుకుని నేలకి కాలందని మగ పిల్లలు సీటు మీద కూర్చోకుండా సైకిల్ మధ్యనించి కాలు పెట్టి పెడల్ తొక్కుతారు.. తర్వాత నెమ్మదిగా సీటు ఎక్కుతారు.

ఆడపిల్లలేమో పరికిణీలు పైకి దోపుకుని మెల్లి మెల్లిగా భయం భయంగా మొదలు పెడతారు. ఒక పక్కన ఆటలాడే పిల్లలూ, మరొక పక్కన సైకిళ్ళూ, ఇప్పుడిప్పుడే వస్తున్న చిన్న బళ్ళూ నేర్చుకునే వాళ్ళతో గ్రౌండు ఎప్పుడూ హడావిడిగా ఉంటుంది. అలా చిన్నిగాడు సైకిల్ తొక్కడం నేర్చుకుని రెండు వారాల తర్వాత వాళ్ళ నాన్నని కూడా తీసుకెళ్ళి తొక్కి చూపించాడు. ఆయన వెంటనే తన సైకిల్ ఇచ్చేసాడు కొడుక్కి.

' ఇప్పుడీ రైలు పేరు చెప్పి గ్రౌండ్ కాస్తా కొట్టేస్తారేమో? పాపం మిగతా పిల్లలు సైకిల్ తొక్కడం ఎలా నేర్చుకుంటారు? రోడ్డుమీద తొక్కనివ్వరు పెద్దవాళ్ళు.. తను బండి నేర్చుకోవలన్నా గోపాలంగారి గ్రౌండే కావాలి కూడానూ. 'గోపాలంగారి ఇంటికీ, గ్రౌండు కీ ఏమీ కాకూడదు దేవుడా ! ' అని దండం పెట్టుకున్నాడు.

' సుధమ్మా, బూరెలందుకో! ' అన్న కేకకి అప్పటివరకూ లోచనలో ఉన్న సుధ బూరెల బుట్ట అందించింది. తన చిన్నప్పుడు వంట్లో బావుండేది కాదుట. తరచుగా ఆ యాసం, దగ్గూ, జలుబూ అవీ వస్తూ ఉండేవిట. అప్పుడు డాక్టర్ గారు.. ' పిల్లని బయటకి పంపకండి '.. అనగానే అమ్మా వాళ్ళు భయపడిపోయి తనని ఇల్లు దాటనిచ్చేవారు కాదు.

వాళ్ళ నాన్న అయితే మరీనూ.. పిల్ల ఆరోగ్యం కన్నా నాకేదీ ఎక్కువ కాదు. చదువు లేకపోయినా పరవాలేదు అంతే కానీ పక్కఊరి బడికి పంపను అని మొండికేస్తే, గోపాలంగారి బడి దగ్గర ఉండటం వల్లనూ, ఆయన వాళ్ళ నాన్నగారికి నచ్చచెప్పడం వల్లనూ కనీసం ఐదో క్లాస్ వరకూ అక్కడ చదువుకోగలిగింది. తర్వాత పెద్దదయ్యి ఆరోగ్యం మెరుగుపడ్డాకా బి.ఈడీ చేసి ఈ మధ్యనే అమలాపురం స్కూల్లో టీచర్ గా చేరింది. అందుకే సుధకి ఆ ఇల్లన్నా, ఆ బడన్నా చెప్పలేని అభిమానం.

ఈ మధ్యన ఎన్ని కాన్వెంటులూ, పబ్లిక్ స్కూళ్ళూ అవీ వచ్చినా సరే అగ్రహారం వారందరికీ గోపాలంగారి బడి అంటే చాలా ప్రత్యేకం. ఊరికే ఒక రోజయినా పిల్లలని అక్కడ కూర్చోబెట్టి తరవాతే మరే స్కూల్ కైనా పంపుతారు. 'అయ్యో! మా స్కూల్ కూడా పోతుందేమో.. రైలు ఇళ్ళముందునించీ వస్తే.. ' అని సుధ మనసు విల విల లాడింది.

సీను, బుజ్జీ, పండూ.. సత్తీ.. వీల్లందరూ బాగా చిన్నపిల్లలు. రోజూ బడి వదిలెయ్యగానే రయ్యిని పరిగెత్తుకుని వెళ్ళి గోపాలం తాతగారి ఉయ్యాల బల్ల మీద పడిపోవడమే వాళ్ళ పని.. అప్పటికి అమ్మమ్మగారు ఉంటే జంతిక ముక్కలో, మైసూరుపాకమో పెడతారు కూడా.. ఎంతసేపు ఊగినా ఏమీ అనరు. ఇంకా ఇళ్ళకి రాలేదని అమ్మలు కబురు పంపేదాకా.. వాళ్ళకి ' ఉయ్యాలాబల్ల ఏమవుతుందో ?' అని బాధగానే ఉంది.

శాంతీ, అరుణా, కమల.. వీళ్ళందరికీ మరొక దిగులు.. వాళ్ళ ఇళ్ళల్లో పెద్ద ఖాళీ స్థలం లేక సంక్రాంతికి గొబ్బిళ్ళు పెట్టుకోవడం కష్టం ఇంట్లో తులశమ్మ దగ్గర పెట్టుకున్నా పాటలు పాడి గొబ్బెమ్మలచుట్టూ తిరగడానికి బావుండదు.. 'దానికింత బాధేముందర్రా? మన వాకిట్లో పెట్టుకుందురుగానీ అంటారు వరలక్ష్మి అత్తయ్యగారు.

అంతేనా.. శనగపప్పూ, కొబ్బరీ పోపువేసి ప్రసాదం కూడా పెద్ద బేసిన్ నిండా చేసేస్తారు.. వాళ్ళ అమ్మాయిలేమో గొబ్బెమ్మలు పెట్టడం లోనూ, పాటలు పాడి పిల్లలందరినీ చక్కటి డాన్స్ లూ అవీ చేయించడం లోనూ ఎంతో సహాయం చేస్తారు. 'కిందటిసారి 'అటవీ స్థలములకరుగుదుమా, వటపత్రంబులు కోయుదుమా 'పాట కూడా నేర్పించారు. 'అయ్యో ఈ రైలేదో వచ్చేస్తే మనం గొబ్బిళ్ళెక్కడ పెట్టుకుంటాం'? అని వాళ్ళకి ఒకటే బాధ..

రామలక్ష్మి కొత్త పెళ్ళికూతురు. మెడలో ఇంకా పచ్చగా మెరుస్తున్న మంగళసూత్రం, ఆరీ, ఆరని కాళ్ళ పారాణీ, కళ్ళల్లో ఇదీ అని చెప్పలేని మెరుపూ ఆ విషయాన్ని చెప్పకుండానే చెపుతున్నాయి. చందనపు బొమ్మలా ఉంటుంది ఆ పక్క ఊరి మేష్టారమ్మాయి. అగ్రహారంలో తెలిసిన వారైన భూషణంగారింట్లో మూడు గదుల వాటాలో అద్దెకుంటారు వాళ్ళు. రామలక్ష్మి పెద్దది, జయలక్ష్మి చిన్నది.. తరవాత తమ్ముడు సూరిబాబు.

కిందటి వారమే రామలక్ష్మి పెళ్ళి అయింది అగ్రహారంలోనే.. కల్యాణ మంటపాల దగ్గరనించీ కంటి కాటుక దాకా అన్నీ అద్దెకు తెచ్చుకునే లాంటి వ్యవహారాలెరగరు అగ్రహారంలో. ఎవరింట్లో పెళ్ళయినా అగ్రహారంలోనే పెళ్ళి జరిగినట్టే.

గోపాలంగారు, వారి భార్యా మరీనూ. ఊరిలో దాదాపు సగం మంది ఇళ్ళల్లో పెళ్ళిళ్ళకి గోపాలంగారి ఇల్లే విడిది.. అందుకే ఆ ఇంట్లో మూడు వంటిళ్ళు. మగ పెళ్ళివారు ఊరిలో అడుగుపెట్టినప్పటినించీ, అప్పగింతలయ్యి పిల్లని తీసుకుని వెళ్ళేదాకా ఆడపెళ్ళివారితో సమానంగా తమ ఇల్లయిన విడిదింట్లో సమస్త మర్యాదలూ జరిపించడంలో ముందుంటారు. గోపాలంగారూ. వరలక్ష్మమ్మగారూ.

రామలక్ష్మి పెళ్ళికిఅంతే.. వారి ముందు కచేరీ వసారాలోనే పెళ్ళికూతురుని చేసారు.. తర్వాత గ్రౌండులో భోజనాలు పెట్టారు. పెళ్ళి కూడా వారి వాకిట్లోనే.. తమ ఇంట్లో విడిదైనా, పెళ్ళి అయినా సరే.. వాకిలంతా పెద్ద పందిరి వేయించారు.. పెద్ద పెద్ద గంగాళాలు అటకమీద నించి దింపించి మంచినీళ్ళు పెట్టించారు

' మగపెళ్ళివారి సంగతి మేం చూస్తాం లే! ' అని వేడి వేడి గా ఉప్మాలు పెట్టించారు. పసుపు కొమ్ములు దంపించారు, అరటి ఆకులు కోయించారు. ఇలా ఒకటేమిటి? రామలక్ష్మి పెళ్ళికి అన్నీ దగ్గరుండి జరిపించారు. ఊరిలో సంబధమే అయితే పెళ్ళి తమ ఇంట్లోనూ, కాకపోతే విడిదింటిగానూ ఇలా ఎన్నో పెళ్ళిళ్ళు వారిద్దరి చేతిమీదుగా జరిగాయి.

అలాంటి ఇంటికి ఈ రైలు పేరున ఏదైనా అయితే? అని రామలక్ష్మి భయపడింది.. ఆ ఇల్లు ఎప్పటికీ ఇలాగే ఉండాలి.. అగ్రహారానికి రైలు అక్కర్లేదు.. అనుకుంది.

లేక లేక కొడుకు పుడితే వైభవంగా బారసాల తన ఇంట్లో చేసుకుని, గోపాలం గారి వాకిట్లో భోజనాలు పెట్టుకున్న పండుబాబూ, గుడి ఆ వరణలోమరమ్మత్తు చేయించాల్సి వస్తే, అప్పటికప్పుడు పందిరి వేయించి తమ ఇంట్లో హరికథ ఏర్పాటు చేసినప్పుడు అక్కడ కథ చెప్పిన దాసు గారూ, చిన్న వరదలొచ్చి ఊర్లోకి నీరు పొంగిపోయినప్పుడు దిగువన ఉన్న ఇళ్ళవాళ్ళందరినీ తమ పెరట్లోనూ, ఇంట్లోనూ అట్టేపెట్టుకుని తిండీ బట్టా లోటు లేకుండ చూసుకున్నపుడు కళ్ళ నీళ్ళు పెట్టుకుని వారిద్దరి కాళ్ళమీద పడిన ఊరిజనం..

ఇలా ఒకరేమిటి? ఎందరికో ఆ ఇంటితో అనుబంధం.. వాకిలిపై వాత్సల్యం. గ్రౌండ్ అంటే గౌరవం.. బడితో బంధం.. అన్నింటినీ మించి గోపాలంగారన్నా, వరలక్ష్మమ్మగారన్నా, వారి పిల్లలన్నా ఉన్న మమకారం.

'భోజన కాలే హరినామస్మరణా.. గోవిందా.. గోవిందా' అని అనుకుంటో భోజనం చేస్తున్న అందరి మనసుల్లోనూ తమ ఇంటికంటే, వాకిళ్ళకంటే గోపాలంగారి లోగిలి మీదే ఎక్కువ ఆత్రం ..దాని మీదే బెంగ..

మా అగ్రహారానికి రైలూ వద్దు, విమానమూ వద్దు.. మా గోపాలంగారి లోగిలి చల్లగా అలాగే ఉంచు.. మంచికీ, చెడ్డకీ, మూలవిరాట్టులా కొమ్ము కాసే మా మూలాధారం అది అని రాముడిని మనస్పూర్తిగా కోరుకున్నారు.

ఏనాడూ ఇంటికి తాళం వేయడం అనేది ఎరగని గోపాలంగారు.. ఎవ్వరైనా తన వారే అనుకుని మనస్పూర్థిగా ఆదరించే వరలక్షమమ్మగారు, ముత్యాల్లాంటి వారి ఆడపిల్లలూ, కొడళ్ళూ, కొడుకులూ.. అందరూ ఎప్పుడూ చెప్పేది ఒక్కటే మాట..

ఇల్లంటే ఇసుకా, ఇటుకా మాత్రమే కాదు.. వాకిలంటే కడిగి ముగ్గేసుకునే చపటా కాదు.. మనతో పాటు నలుగురు సంతోషంగా ఉన్నప్పుడే అది ఇల్లు.. లోగిలి.. అని.. అందుకే అందరూ ఇంటిగురించి అందరికీ అంత ఆలోచన..

Click here to share your comments on this article